పేరుకే టాస్క్‌ఫోర్స్ కమిటీలు

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త
- ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుధ్యం గాలికి..
- జరిమానా కూడా విధించని వైనం
- మండలంలో మూడు టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- పరిస్థితి అస్తవ్యస్తం



ముస్తాబాద్, మొర్రాయిపల్లె దారిలో నిండిన చెత్త, ప్లాస్టిక్ వస్తువులు



వ్యర్థపదార్థాలతో కాలువ

ముస్తాబాద్: ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు నడుం బిగించింది. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడం లాంటి వాటి నియంత్రణకు చేపట్టిన చర్యలకు క్షేత్ర స్థాయిలో స్పందన మద్దతు కనిపించడం లేదు. గ్రామ పంచాయతీలు పారిశుధ్య నిర్వహణ, నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై నియంత్రణ చేసేందుకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసింది. వీరు ప్రతి పక్షం రోజులకొకసారి ఎంపిక చేసుకున్న గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, పారిశుధ్య నిర్వహణ, డ్రెయినేజీల శుభ్రత, నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై దృష్టిసారించాలి. కాని ముస్తాబాద్ మండలంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ పెద్దగా పనిచేస్తున్నట్లు దాఖలాలు కనిపించడం లేవు. ఈ విధంగా ఒక కమిటీ ఉన్నదనే విషయం కూడా చాలామందికి తెలియదంటే అతిశయోక్తి లేదు. రహదారుల వెంట చెత్త పారవేయడం, మురుగునీరు రోడ్లపై పారడం, ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పారవేయడం చూస్తుంటే కమిటీలు ఏమేరకు పనిచేస్తున్నాయో అర్థమవుతుంది.

టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏం చేయాలి?

స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామీణాభివృద్ధి ఆదేశాల మేరకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించి, విధులను తెలియపరిచారు. కమిటీలో మండల స్థాయి అధికారితో మూడు బృందాలను ఎంపిక చేశారు. ఒక్కో అధికారి బృందంలో ఐకేపీ, సీఆర్‌పీలను నియమించారు. వీరు ప్రతి నెల 5, 15వ తేదీల్లో ఎంపిక చేసుకున్న రెండు గ్రామాలను ఈ కమిటీ సందర్శించాలి. మూడు బృందాలు ఆరు గ్రామాలను ఒకేసారి విజిట్ చేసి, అక్కడ మురుగునీటి వ్యవస్థ ఎలా ఉంది, తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారా లేదా, ఎక్కడ పారవేస్తున్నారు, చెత్త సేకరించే విధానం, నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని గమనించాలి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మురుగు నీటి కాల్వలు, దుకాణాలు, హోటళ్లను సందర్శించాలి. వారి దృష్టికి వచ్చిన చెత్త, మురుగు వ్యవస్థ ఇబ్బందులను గ్రామపంచాయతీకి తెలియపరుస్తూ, తగు సూచనలు, సలహాలు ఇవ్వాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టంలోని నిబంధనల మేరకు రూ.500 మించకుండా జరిమానాలు విధించాలి. వారి పరిశీలనలోకి వచ్చిన అంశాలను ఎంపీడీవోకు కూడా నివేదించాల్సి ఉంటుంది.

కమిటీ ఉనికి ఎక్కడ..?

ముస్తాబాద్ మండలంలో ఇద్దరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతోపాటు ఒక ఏఈలతో మూడు కమిటీలను ఏర్పాటు చేశారు. వారికి తోడుగా సీఆర్‌పీలు, ఐకేపీ సిబ్బందిని నియమించారు. 22 గ్రామాలను మూడు కమిటీలకు విభజించారు. వారు క్షేత్రస్థాయిలో ప్రతి నెల 5, 15 తేదీల్లో గ్రామాలను సందర్శించి, అవగాహన సదస్సులు, సూచనలు, సలహాలు ఇచ్చినట్లుగా కనిపించడం లేదని, మొక్కుబడిగా కమిటీలు పనిచేస్తున్నాయని ఆ శాఖ అధికారులే అంటున్నారు. మిగతా మండలాల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారికి పెద్ద ఎత్తున జరిమానా విధించగా, ముస్తాబాద్ మండలంలో ఇప్పటి వరకు ఒక్కరికి కూడా జరిమానా విధించలేదంటే కమిటీ ఏ మేరకు పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు.

గ్రామాల్లో ఇబ్బందులు ఇవీ..

ముస్తాబాద్ మేజర్ పంచాయతీతోపాటు పోతుగల్, గూడెం, నామాపూర్, ఆవునూర్ తదితర గ్రామాల్లో చెత్త సమస్య, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం అధికంగా ఉందని అధికారులు అంటున్నారు. మండల కేంద్రంలో పోతుగల్ రహదారి, మానేరు కెనాల్, అంబేద్కర్‌నగర్, మానేరు కెనాల్, రత్నాల కుంట, దుబ్బాక దారి, మొర్రాయిపల్లె రహదారి చెత్త, ప్లాస్టిక్‌తో నిండిపోయి ఉంది. కల్యాణాలు, ఇతర శుభకార్యాలు జరిగినప్పుడు వచ్చే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, వ్యర్థ పదార్థాలను రోడ్లపై పారవేస్తున్నారు. దీనిని నియంత్రించే వారు లేరు, కనీసం అవగాహన కల్పించడం లేదని అంటున్నారు. మురుగు నీరు రోడ్లపై పారడం, సిల్ట్ పేరుకుపోతోంది. కమిటీలు వీటన్నింటిని పరిశీలించి, సంబంధిత శాఖలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది. అయితే కమిటీ బాధ్యులకు వారి మాతృశాఖ విధులతోనే సరిపోతోందని, ఇక అదనంగా టాస్క్‌ఫోర్స్ డ్యూటీలు ఏం చేస్తారనే చర్చ కూడా జరుగుతోంది. పైగా ముస్తాబాద్ మండలంలో మూడు బృందాలకు మహిళా అధికారులే ఉండడం గమనార్హం. వీరు గ్రామాలకు వెళ్లితే అక్కడి యంత్రాంగం అంతగా రిసీవ్ చేసుకోవడం లేదని అంటున్నారు.

పూడిక తీయక రెండు నెలలైంది



మా కాలనీలో మోరీల్లో పూడిక తీయక రెండు నెలలైంది. దోమలు, దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. సాయంత్రం అయిదంటే భయం అయితోంది. మానేరు కాల్వ మొత్తం మోరీ నీళ్లతో నిండిపోయింది. కంపు వాసన భరించలేక పోతున్నాం. కాలువల్లో చెత్త పేరుకుపోయింది. రోగాలు వస్తున్నాయి.

– మచ్చ రజిత, ముస్తాబాద్

అవగాహన కల్పించాలి



ముస్తాబాద్, పోతుగల్ ఇతర పెద్ద గ్రామాల్లో ప్లాస్టిక్ సంచులు, వస్తువుల వాడకం పెరిగింది. దీంతో అనేక రోగాలు వస్తున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించాలి. టాస్క్‌ఫోర్స్ కమిటీ గ్రామాలను సందర్శించి ప్రజలను చైతన్యవంతులను చేయాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలి.

– తోట ధర్మేందర్, పోతుగల్

కమిటీలు బాధ్యతతో పనిచేయాలి



ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను వేసింది. వారు బాధ్యతతో గ్రామాలను సందర్శించి, వారి దృష్టికి వచ్చిన సమస్యలపై అక్కడి పాలకవర్గానికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలి. పారిశుధ్యంపై నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే అధికారం కమిటీలకు ఉంది.

– రమాదేవి, ఎంపీడీవో, ముస్తాబాద్

క్లుప్తంగా

కరువు తీరా గోదావరి జలాలు



గోదావరి జలాలకు పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మెట్టప్రాంత కరువు సీమకు గోదావరి జలాలు వరప్రదాయనిగా మారాయని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండలంలోని మద్దికుంట, మోహినికుంట గ్రామాల్లో మల్లన్నసాగర్ కెనాల్‌కు చేరుకున్న గోదావరి జలాలకు బుధవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గొప్ప దార్శనికతతో సిరిసిల్ల సీమకు కాళేశ్వరం గోదావరి నీరు వచ్చి చేరిందన్నారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో మండలంలోని 30 చెరువులకు గోదావరి నీటిని అధికారులు మళ్లిస్తున్నారన్నారు. భూగర్భ జలాలు పెరిగి సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండబోవన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యులు చంద్రశేఖర్‌రావు, పూర్ణచందర్‌రావు, యాదగిరిగౌడ్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన ప్రదర్శన



కోర్టు గేటు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వేములవాడ: నల్గొండ జిల్లా సురేందర్ అడ్వకేట్‌పై దాడి, రాజస్థాన్ జోధ్‌పూర్‌లో నడిరోడ్డుపై అడ్వకేట్‌ను హత్య చేసిన ఘటనలను నిరసిస్తూ వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజులపాటు నిరసన కార్యక్రమాలు తెలియజేస్తామని అధ్యక్షుడు ప్రకటించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్వే హద్దులు నిర్ణయించాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని మల్లేషుని గుట్ట వద్ద ప్రభుత్వ భూమి సుమారు 10 ఎకరాలు ఉంటుందని, ఆ భూమిని కొందరు రైతులు ఆక్రమిస్తున్నారని, ఆ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి బుధవారం తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు అశ్వాక్, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సభ

- సమస్యలపై చర్చించకుండానే ముగింపు



మండల సభకు హాజరైన ప్రజాప్రతినిధులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బూర వజ్రమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం తూతూ మంత్రంగా నిర్వహించారు. ఎన్నో ప్రజలు సమస్యలు చర్చించాల్సిన మండల సభలో ఒకటి, రెండు అంశాలకు మాత్రమే పరిమితమైంది. ఈ సమావేశంలో వేములవాడ తహసీల్దార్ రాజు మాట్లాడుతూ ముంపు గ్రామాల్లోని మిగిలిన సమస్యలపై ఇటీవల గ్రామాల్లో నిర్వాసితులు అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి అర్హులైన వారిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామన్నారు. గతంలో గెజిట్ అయి ఉండి ఇప్పటికీ ప్లాట్‌లు అందని వారు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి వారికి న్యాయం చేస్తామన్నారు. కొడుముంజ సర్పంచ్ కదిరె రాజుకుమార్ మాట్లాడుతూ గ్రామంలో నాలుగేళ్ల క్రితం శ్మశానవాటిక నిర్మించినా దారిలేక నిరుపయోగంగా ఉందన్నారు. అధికారులు పట్టించుకుని దారి చూపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీడీవో శ్రీధర్, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, పీఏసీఎస్ రేగులపాటి కృష్ణదేవరావు, ఎంపీటీసీలు వనపర్తి దేవరాజు, బస రాజశేఖర్, సర్పంచులు కొండపల్లి వెంకటరమణారావు, రాసూరి రాజేశం, రేగులపాటి రాణి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

తాళాలున్న డబుల్ బెడ్రూం ఇళ్ల స్వాధీనం

- పట్టాలు పొందిన వారికి నోటీసులు



తాళం ఉన్న ఇంటికి నోటీస్ వేసిన రెవెన్యూ సిబ్బంది

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ఏడాది కాలంగా తాళాలు వేసి వున్న డబుల్ బెడ్రూం ఇళ్ల స్వాధీనం చేసుకునేందుకు బుధవారం నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ మునీందర్ తెలిపారు. పట్టణంలో 156 మందికి ఇళ్ల పట్టాలు అందజేశామని, వారిలో కొంతమంది నివాసం ఉండడం లేదన్న ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈమేరకు ఆర్‌ఐ, రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించి, నెలరోజులుగా తాళాలు వున్న 17 ఇళ్లను గుర్తించామన్నారు. వారు చాలా రోజులుగా అందులో ఉండడంలేదని తేలిందన్నారు. తాళాలు వున్న ఇళ్లకు తాళాలు వేసి, డబుల్ బెడ్రూం పట్టాలు ఎందుకు రద్దు చేయకూడదో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు అందజేశామన్నారు. సిద్దిపేట, ఇతర గ్రామాల్లో నివాసం ఉంటున్నట్లు రుజువైన పక్షంలో వారి పట్టాలు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఎంతోమంది పేదలు ఇంకా అద్దె ఇళ్లలో ఉంటున్నారని వారికి ఈ ఇళ్లను కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటం దహనం

- వరంగల్‌లో కాంగ్రెస్ నాయకుడిపై దాడిని ఖండిస్తూ నిరసన ప్రదర్శన



కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేసేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: వరంగల్ జిల్లాకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు పవన్‌కుమార్‌పై బీఆర్‌ఎస్ నాయకుల దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు మునిగెల రాజు, చుక్క రాజశేఖర్, అరెపల్లి బాలు, శ్రీకాంత్, పర్శరాములు, రవి, రాజు, భూపాల్‌రెడ్డి ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని ఠాణాకు తరలించారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని) వారిని పరామర్శించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు కొందరు గుండాల్లాగా వ్యవహరిస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిపై దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. మంత్రి కేటీఆర్ మెప్పు కోసం పోలీసులు కూడా అత్యుత్సాహం చూపుతున్నారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించబోమని స్పష్టం చేశారు.

పంచాయతీలకు 80 శాతం కేంద్రం నిధులే



సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్లలో హామీలే తప్ప అమలు చేసిన దాఖలాలు లేవని బీజేపీ నాయకులు ప్రభారి మీసాల చంద్రయ్య, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య అన్నారు. వేములవాడ మండలంలోని జయవరం, లింగంపల్లి గ్రామాల్లో శక్తి కేంద్రం ఆధ్వర్యంలో బూత్ కమిటీల కార్నర్ సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీలో జరిగే పలు అభివృద్ధి పనుల్లో 80 శాతం కేంద్ర నిధులే ఉన్నాయని వారు గుర్తు చేశారు. రైతులకు 24 గంటల కరెంట్ అని చెబుతూ కేవలం ఏడు గంటలు కూడా ఇవ్వడం లేదని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పటి వరకు ఎక్కడా ఇవ్వడం లేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు జక్కుల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బూరుగుపల్లి పరమేశ్, లింగంపల్లి కుంటయ్య, పోకల రాజు, చెరుకు రమేశ్, మహేశ్, తిరుపతి, కిషన్‌రెడ్డి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాయన్నను అవమానించారు

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దెల్లి స్వామిగౌడ్



మాట్లాడుతున్న స్వామిగౌడ్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర శాసనసభ్యుడు జ్ఞాని సాయన్న మృతిచెందగా ప్రభుత్వ లాంఛనాలతో అంతిమసంస్కారాలు నిర్వహించలేని ప్రభుత్వంపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దెల్లి స్వామిగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బహుజన లీడరైన సాయన్నకు జరిగిన అవమానంగా పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ ఆఫీసులో జరిగిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. ఈ విషయమై అందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నోరు మెదపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బహుజనులు జాగృతం కావాలని కోరారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి మ్యాకల మునీందర్, నాయకులు లింగంపల్లి మధుకర్, బొడ్డు మహేందర్, బందెల దేవరాజు, చెక్కపల్లి శ్రీనివాస్, నాంద్యానాయక్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ.?

ముస్తాబాద్: పట్టణంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని కాంగ్రెస్ నాయకుడు ఉపేంద్ర గ్రామసభలో అధికారులను నిలదీశారు. ప్రజాప్రతినిధులే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై వాదోపవాదాలు జరగడంతో ఆవేశానికి గురైన ఉపేంద్ర అధికారుల చేతిలో ఉన్న మినిట్స్ బుక్‌ను లాక్కొనే ప్రయత్నం చేశాడు. దీంతో మినిట్స్ బుక్ చినిగిపోయింది. నిబంధనల మేరకే నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని, గ్రామసభలో ఇలాంటి ఆవేశాలు సరికాదని సర్పంచ్ గాండ్ల సుమతి అన్నారు. మినిట్స్ బుక్ చింపివేసిన ఉపేంద్రపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామసభ మర్యాద తెలియకుండా వ్యవహరించరాదన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం రాజన్నపేటలో బుధవారం హైమాస్ట్ లైట్లను జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక ప్రారంభించారు. అలాగే రాచర్ల బొప్పాపూర్‌లో సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచులు బాల్‌రెడ్డి, శంకర్, వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట: ప్రజలు గ్రామాల్లో కొత్తగా కనిపించే అపరిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై మహేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను కొందరు దొంగలు గమనిస్తూ చోరీలకు పాల్పడుతున్నారని, అలాంటి అపరిచిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

వీర్నపల్లి: సెస్ వినియోగదారులు విద్యుత్ బకాయిలు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని సెస్ ఏఈ దివ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రస్తుతం మండలంలో రూ.1.63 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. విద్యుత్ బకాయిలు పేరుకుపోతే వినియోగదారులే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సకాలంలో బకాయిలు చెల్లిస్తే మెరుగైన విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. బకాయిలతో సంస్థ తీవ్ర నష్టాల్లో కొనసాగుతుందని తెలిపారు. లైన్ ఇన్‌స్పెక్టర్ తుల సీరాం, సిబ్బంది కిష్టయ్య, గోవింద్‌నాయక్, పరమేశ్, లక్ష్మీరాజం పాల్గన్నారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడికి సత్కారం

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన దామోదర్‌రెడ్డిని బుధవారం సత్కరించారు. జిల్లా ఉద్యోగుల సంఘం తరఫున ఆయనను సత్కరించారు. ఉద్యోగుల సంక్షేమానికి పాటు పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు మాదాసు బలరాం, చౌకి సుధాకర్, మెట్ట రామస్వామి, ఆకుల శ్యామ్, గుడ్ల హరికిషన్, టీవీ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ 2018 ఎన్నికల్లో లక్ష వరకు రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రూ.90 వేల వరకే రుణమాఫీ చేస్తామని అసెంబ్లీలో ప్రకటించడం భావ్యం కాదని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నాగసముద్రాల సంతోష్ ఒక ప్రకటనలో ఆక్షేపించారు.

పుస్తెమెట్టెలు అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన శివరాత్రి రాజవ్వ మల్లయ్య దంపతుల ద్వితీయ పుత్రిక స్వప్న పెళ్లికి స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి బుధవారం పుస్తె మట్టెలు అందజేశారు.

సమాచారం

భగీరథ నీటి సరఫరా బంద్

వేములవాడ: వేములవాడ, చొప్పదంటి నియోజకవర్గాలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ నీటి సరఫరాను ఈనెల 23, 24 తేదీల్లో నిలిపి వేస్తున్నట్లు మిషన్ భగీరథ సిరిసిల్ల గ్రిడ్ కార్యనిర్వహణాధికారి ఎస్. విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రహారం వద్ద నీటి సరఫరాకు సంబంధించిన మేయింటెనెన్స్ ఉండటం వల్ల రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలంతా గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వేములవాడరూరల్: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు అందరూ 11 గంటల వరకు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష జరగనున్నట్లు తెలిపారు.

నియామకం

కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా వినయ్

కోనరావుపేట: కాంగ్రెస్ కోనరావుపేట మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పాకాల వినయ్‌ను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ నియామకపత్రాన్ని అందజేశారు.

వాహన తనిఖీలు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లిలో రూరల్ ఎస్సై నాగరాజు వాహన తనిఖీలు చేపట్టారు. కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్‌స్టిక్కర్‌ను తొలగించి, యజమానులకు కౌన్సిలింగ్ చేశారు.

రైతుల ఆందోళన

గంభీరావుపేట: నర్మాల ఫుడ్ ప్రాసెస్ బాధిత రైతులు చేపట్టిన ఆందోళనకు బుధవారం బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ నిబంధనల మేరకు రైతులకు భూసేకరణ పరిహారం అందజేయాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. నర్మాల రైతులు చేపట్టిన ఆందోళన న్యాయమైనదన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, మహేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లె గ్రామంలో నట్టల నివారణకు మందుల పంపిణీని బుధవారం ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. 1,175 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ తెలిపారు. సర్పంచ్ బాలమల్లు, ఎంపీటీసీ లావణ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం పల్లిమక్త, మంగళ్లపల్లి గ్రామాల్లో బుధవారం నట్టల నివారణ శిబిరాన్ని సర్పంచులు జిన్న అనిల్, సంతోష్ ప్రారంభించారు. మొత్తం 1,123 గొర్లకు, 334 మేకలకు నట్టల నివారణ మందులు ఇచ్చినట్లు వైద్యాధికారి అంజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గొర్ల కాపరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలం హరిదాస్‌నగర్, రాచర్ల తిమ్మాపూర్ గ్రామాలలో బధవారం పశువైద్య శిబిరాలను జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, పశువైద్యాధికారి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, రైతులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని గోరింటాలలో నట్టల నివారణ మందులను బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పశువుల లో నట్ట నివారణ మందులను పంపిణీ చేస్తామని పశు వైద్యాధికారి శ్రావణ్ తెలిపారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డితండాలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ లకావత్ ప్రమీల బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోనేటి రేణుక, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎన్‌ఎంలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారంలో బుధవారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రతి వ్యక్తిలో అంధత్వాన్ని పారద్రోలటానికి కంటి వెలుగు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సర్పంచ్ మునిగె అమృత, రవీందర్, కృష్ణహరి పాల్గొన్నారు.